
# ఓ గొలుసు కథ

'వఘురా'



సరోజకి పండంటి పిల్లవాడు పుట్టి ఈ రోజుకు ముచ్చటగా మూడో రోజు. సరోజ రమేష్‌ల ఆనందానికి అవధుల్లేవు. రమేష్ ఆఫీసు స్టాఫ్ అందరికీ గ్రాండ్‌గా పార్టీ ఇచ్చాడు.

రమేష్ రమ్మని రాయటంతో బయలుదేరి వచ్చింది అతని తల్లి వసుంధరమ్మ. పిల్లవాడికి నాలుగు నెలలొచ్చాయి. పిల్లవాడి ఆలనా పాలనలో తన కష్టాన్ని మరిచిపోగలుగుతోంది ఆమె. వసుంధరమ్మది మామూలు మధ్య తరగతి కుటుంబం. ఆస్తిపాస్తులు పెద్దగా లేవు. ఉన్న కాస్తా ఆడపిల్లల పెళ్ళిళ్ళకి అయిపోయింది. ఆఖరివాడయిన రమేష్‌ని ఎలాగో డిగ్రీ అయిందనిపించారు. అదృష్టం కలిసి రావటంతో రమేష్ కాస్త మంచి ఉద్యోగంలోనే స్థిరపడ్డాడు. భర్త ఈ మధ్యనే కాలం చేశాడు. భర్త పోయాక వచ్చే పెన్షన్‌తోనే కాలక్షేపం చేస్తోంది వసుంధరమ్మ.

ఆ రోజు....

"సరోజా .... ఈ కుక్కర్ కొన్నాను. ఎలా వుందో చూడు" అంటూ కుక్కర్ టేబుల్ మీద పెడుతూ కేకేసాడు రమేష్.

పరుగున వచ్చింది సరోజ. "బాగుందండీ. అయినా నెలాఖర్న అంత డబ్బు ఎక్కడిదీ" అడిగింది ఆశ్చర్యంగా.

"మా ఫ్రెండొకడు సర్దాడులే. నీకు నచ్చింది గదా" అంటూ భార్య బుగ్గ మీద చిటికేసాడు రమేష్.

"అబ్బ పోదురూ బడాయి. మన మింకా గ్యాస్ పొయ్యి, టి. వి. మిక్సీ, ఫ్రిజ్ ఇవన్నీ కొనద్దుటండీ అప్పుడే ఏమయిందీ" అంది హేళనగా.

"అబ్బబ్బ.... ఆపు నీ కోరికల లిస్టు. అవన్నీ కోరిందే తడవుగా కొనటానికి నేనేం లక్షాధికారిని కాను. పైగా మా అమ్మ నాకేం ఆస్తి ఇవ్వలేదు. నువ్వడిగినవన్నీ ఈ క్షణాన కొనటానికి" అన్నాడు రోషంగా, వోరగా వసుంధరమ్మ వైపు చూస్తూ.

ఆ మాటలకి వంట ఇంటి తలుపుకి ఆనుకుని కూర్చున్న వసుంధరమ్మ మనసు చివుక్కుమంది. ఏమీ అనలేక నిట్టూర్చింది బాధగా.

'ఏమీ లేదని తెలిసీ అట్లా మాట్లాడ్డం మూర్ఖత్వంరా' అనుకుంది మనసులో.

మర్నాడు తాను మామూలుగా వంట ప్రయత్నం చేస్తూ, "సరోజా ఈ గ్యాస్ పొయ్యిని ఎలా

ఉపయోగించాలో చెప్పమ్మా'' అంది కొత్తగా కొన్న గ్యాస్ పొయ్యి వంక చూస్తూ.

''మీరు ఇప్పుడా పొయ్యి మీద వంట చేయనక్కర్లేదు. మామూలుగా స్టౌ మీదే చేయండి. దాన్ని ఎటు తిప్పాలో తెలీక చెడగొడతారు''— అంది సరోజ.

''అది కాదమ్మా! దాన్ని ఒకసారి చూపిస్తే చాలు. జ్ఞాపకం ఉంచుకుని చేస్తాను'' అంది వసుంధరమ్మ.

''మీకు తెలీదులెండి. గ్యాస్ పొయ్యి మీద వంట చేయడమంటే గాడి పొయ్యి మీద చేసినట్లనుకున్నారా'' అంటూ హేళనగా నవ్వింది సరోజ.

వంట వసుంధరమ్మ చేసినా మధ్యాహ్నం కాఫీ మాత్రం సరోజే చేస్తోంది. పోన్లే గ్యాస్ పొయ్యి పుణ్యమా అని కాఫీ పని తప్పింది వసుంధరమ్మకి. రాను రాను సరోజకి ఆధునిక సౌకర్యాల మీద మోజు ఎక్కువ కాసాగింది. రమేష్ ఆఫీసు నుండి రాగానే ఒక కప్పు కాఫీ ఇచ్చి కోరికల లిస్టు చదివేది.

''ఏవండోయ్ మన ఎదురింటావిడ మొన్న టి.వి. కొన్నదిటండీ. ఎంతా! మూడు నాలుగు వేలల్లో రావచ్చు. మనం కూడా ఒక టి. వి. కొందామండీ?'' అంది గారంగా భర్త మెడ చుట్టూ చేతులేసి.

''మొన్న నిర్మలా వాళ్ళింటికెళితే అది చల్లని ఫ్రిజ్‌లోని నీళ్ళిచ్చిందండీ! ఆఁ! ఇవాళ అది మనింటి కొచ్చింది. దానికి మన బిందెలోని నీళ్ళివ్వాలంటే సిగ్గుపడి చచ్చాననుకోండి.''

''కొందాం. మా ఆఫీసులో నేను లోన్ కోసం ప్రయత్నిస్తున్నాను. రాగానే అన్నీ కొనేద్దాం సరేనా'' అంటూ నవ్వుతూ చూశాడు రమేష్.

''ఆఁ సంబడం. మీ లోన్ శాంక్షన్ అయ్యే సరికి మనం ముసలివాళ్ళమవుతాం'' అంది ఈసడింపుగా.

''చూద్దాంలేవోయ్. నీ కోరికలు తీర్చే బాధ్యత నాది. నువ్వు మాత్రం రోజూ నన్ను విసిగించకు'' అన్నాడు కాస్త విసుగ్గా.

''ఊఁ!'' అంటూ కాఫీ కప్పు తీసుకుని వెళ్ళిపోయింది. సరోజ మూతి విరుస్తూ.

వాళ్ళ మాటలు విన్న వసుంధరమ్మ 'ఏమిటో ఈ ఆధునిక సౌకర్యాల మీద మోజు. డబ్బు దండగ తప్పితే నాకేం కనబడ్డం లేదు' అనుకుంది

అలా మరో నాలుగు నెలలు గడిచిపోయాయి. ఈ నాలుగు నెలల్లోనూ సరోజ రమేష్‌ని ఇవి కొందాం, అవి కొందామంటూ పోరని రోజులేదు. ఈ నాలుగు నెలల్లో ఈసడింపులతో, సాధింపులతో వసుంధరమ్మ తల వాచిపోయింది. ఎక్కడికయినా ప్రశాంతత దొరికే చోటుకి వెళ్ళాలని మనసు ఉవ్విళ్ళూరుతోంది. ఇహ ఉండలేక చెల్లెలున్న సొంత వూరికి బయలుదేరింది.

*

ఆ ఊళ్ళో నెల రోజులుండి తన పనులు చూసుకుని, ఊరి వారి అప్యాయతలకి తేలికపడ్డ హృదయంతో ఇంటికి బయలుదేరి ఆ రోజే వచ్చింది.

జుట్టు బాగా పెరగాలంటే....

జీవిత కాలంలో సగటున ప్రతీ స్త్రీకి 7.5 మీటర్ల జుట్టు పెరుగుతుంది. ఈ జుట్టును శ్రద్ధగా పోషించుటకు, నెత్తిమీద చర్మాన్ని బాగా మర్దించాలి. తద్వారా రక్త ప్రసరణ బాగా జరిగి, జుట్టు బాగా పెరుగుతుంది. పైగా తల భారం తగ్గి, వుల్లాసం కలిగిస్తుంది.

ప్రతి రోజూ జుట్టు దువ్వుకోవటంవలన, ఎంజైములు, వెంట్రుకల్లోకి సమానంగా ప్రవహిస్తాయి. దీనివలన జుట్టు వల్లగా నిగనిగలాడుతూ వుంటుంది, దుమ్ము, చుండ్రు దూరంగా వుంటాయి.

—మల్లిడి కనకరత్నం, ఆటపాక

సరోజ కళ్ళకి వసుంధరమ్మ కొత్తగా కనబడుతోంది.

రాగానే ఆప్యాయంగా ఆహ్వానించింది సరోజ.

''అత్తయ్యగారూ కాఫీ తీసుకోండి'' అంటూ చేతికందించింది.

''అది సరేగానీ! బాబు ఏడి'' అని అడిగింది వసుంధరమ్మ.

''ప్రక్కవాటావిడ తీసుకెళ్ళింది గానీ ముందు మీరు కాఫీ త్రాగండి చల్లారిపోతుంది'' అంటూ తొందర చేసింది సరోజ.

ఈ అనుకోని, ఎదురు చూడని ఆప్యాయతకి ఉక్కిరిబిక్కిరయింది వసుంధరమ్మ.

''ఏమండోయ్ అత్తయ్యగారొచ్చారు'' అంటూ చెప్పింది ఆ సాయంత్రం ఆఫీసు నుండి వచ్చిన రమేష్‌కి.

'ఆహా!' అని విని ఊరుకున్నాడు ముభావంగా రమేష్.

''ఏమండీ! అత్తయ్యగారి మెళ్ళో బంగారు గొలుసులాగుంది. వాళ్ళ వూరెళ్ళి మెళ్ళో గొలుసుతో వచ్చిందండోయ్'' అంది.

''నాకు తెలిసినంతవరకు ఆవిడకి ఏ బంగారు గొలుసు లేదు. మరి నాన్న చనిపోయినప్పుడు తాకట్టు పెట్టిన గొలుసు విడిపించిందో ఏమో! బహుశా ఆ గొలుసు తాకట్టు విడిపించి ఉంటుంది'. అనుకున్నాడు మనసులో.

వసుంధరమ్మకి రోజులు సాఫీగా నడుస్తున్నాయి. రోజూ రమేష్ ఆఫీసు నుండి రాగానే వసుంధరమ్మను అప్యాయంగా పలకరిస్తున్నాడు. వసుంధరమ్మకి ఏం కావాలో ఆరోగ్యం ఎలా ఉందోనని రోజూ రమేష్ ఆప్యాయంగా తరచి అడుగుతున్నాడు.

వసుంధరమ్మకి ఆ ఇల్లు స్వర్గంలా తోచింది. కొడుకు కోడలి ప్రేమ అనురాగాలకి ఆ నెల రోజులు ఎట్లా గడిచాయో వసుంధరమ్మకే తెలీదు.

ఆ రోజు సాయంత్రం రమేష్ కొత్తగా కొన్న టి. వి.ని పరిశీలిస్తున్న వసుంధరమ్మకి ప్రక్కవాటా ఆవిడతో సరోజ మాట్లాడుతున్న మాటలు లీలగా వినిపిస్తున్నాయి.

''మా అత్తగారు తన మెడలో ఉన్న గొలుసు ఎవరికిస్తుందో. ఎక్కువ రోజులు మా ఇంట్లోనే ఉంది కాబట్టి మాకే ఇస్తుంది లెండి'' ఆ గొంతులో మాకు ఇవ్వకపోతే ఎవరికిస్తుందన్న భావన తొంగి చూసింది.

ఆ మాటలకి వసుంధరమ్మకి తనని బ్రహ్మరథం ఎందుకు పడుతున్నారో అర్థమయింది. 'అహో! ఎంతటి డబ్బు మనుషులు! నా ఒంటి మీద చిన్న యెత్తు లేనప్పుడు నన్ను వంట మనిషి కన్నా హీనంగా చూశారు. కానీ ఈనాడు ఒంటి మీద ఈ గొలుసుండగానే నా మీద ఎంతటి ప్రేమ ఒలకబోస్తున్నారు!!'' ఆశ్చర్యపోయింది వసుంధరమ్మ.

ఆ మర్నాడు సరోజ ఫ్రిజ్ కొందామంటూ పోరు పెట్టసాగింది.

రమేష్‌కి ఈ మధ్య విసుగు కోపం ఎక్కువయ్యాయి. రోజూ చీటికి మాటికి సరోజ మీద పిల్లాడి మీద విసుక్కుంటున్నాడు.

"ఇప్పటికే నీవు కోరినవన్నీ కొంటానికి అన్నింటిలోనూ లోన్‌లు పెట్టాను. ఇహ నావల్ల కాదు నీ కోరికలు తీర్చటం అయినా ఇప్పుడా ఫ్రిజ్ లేకపోతే మన స్టేటస్‌కేం భంగం రాదు'' అన్నాడు విసుగ్గా.

"అబ్బ! మీకేం తెలీదు. అందరిళ్ళలోనూ ఎంచక్కా ఫ్రిజ్‌లున్నాయి. అయినా భార్యని సంతోష పెట్టడం చేతకాక పోతేసరి'' ఈసడిం చింది.

సంగతి అర్ధమయింది వసుంధరమ్మకి.

'ఎందుకు వాడ్ని అట్లా పోరటం. ఏవో ఇప్ప టికే చాలానే అమర్చాడు కదా! వాటితో సంతృప్తి పడక ఏమిటో అంతా విపరీతం' అనుకుంది.

ఆ మర్నాడు సరోజ పోరు పడలేక ఫ్రిజ్ కొని తెచ్చాడు రమేష్. ఈ మధ్య దేనికో సతమత మవుతున్నాడు. మనసంతా గందరగోళంగా ఉంది. సరోజ ఆనందంలో పాలు పంచుకోలేక పోతున్నాడు.

అట్లా నాలుగు రోజులు గడిచాయి. ఈ నాలుగు రోజులు రమేష్ దేనిగురించో దీక్షగా ఆలోచిస్తూనే ఉన్నాడు.

ఫ్రిజ్ కొన్న ఆనందంలో సరోజ పెద్దగా పట్టించుకోలేదు కానీ వసుంధరమ్మకి కొడుకు అలా డీలా పడిపోవటంతో బాధ కలిగింది.

ఆ రోజు సాయంత్రం ఆఫీసు నుండి వచ్చిన రమేష్ ఫైల్స్‌ని విసురుగా సోఫాలో పడేసాడు. చిరాగ్గా బూట్లు విప్పి కాలితో వాటిని సోఫా క్రిందికి విసురుగా తన్నాడు. ముఖంలో ఏదో భయం; తత్తరపాటు కనిపిస్తోంది. మాటి మాటికీ ముఖానికి పట్టిన చెమటని తుడుచుకుంటున్నాడు. ఆ కళ్ళలో భయం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

"బాబూ రమేష్ ఏమిటి అలా ఉన్నావు. తల నొప్పిగా వుందా? ముందు ఈ కాఫీ తాగు కాస్త సర్దుకుంటుంది.'' అంది ఆప్యాయత ఉట్టిపడే స్వరంతో.

మెల్లిగా కాఫీ తీసుకుని తాగాడు.

రమేష్ వాలకం చూస్తున్న సరోజకి భయం వేసింది;

"ఏమిటి రమేష్ నీ కొచ్చిన కష్టం. చెప్పు బాబూ'' వసుంధరమ్మ అంత ఆప్యాయంగా ప్రేమగా అడిగేసరికి దుఃఖం ఆగలేదు రమేష్‌కి.

"అమ్మా నేను చేసిన పనికి నాకు తగిన శిక్షే పడిందమ్మా'' అంటూ వసుంధరమ్మ ఒళ్ళో తల పెట్టాడు.

"ఏమిటిది బాబూ'' రమేష్ తల నిమురుతూ వణుకుతున్న కంఠంతో అంది వసుంధరమ్మ.

"అమ్మా! నేను టి. వి. ఫ్రిజ్ కోసం ఆఫీసు డబ్బు వాడాను. దాని మూలకంగా నన్ను ఉద్యో గంలోంచి సస్పెండ్ చేసారమ్మా. ఇప్పుడా డబ్బు కట్టకపోతే నేను ఉద్యోగం పోయి అడుక్కోవాలి. అంత డబ్బు ఎక్కడ్నుంచి తేవాలో తెలియట్లే దమ్మా'' అన్నాడు దీనంగా.

ఆ మాటలకి సరోజ వసుంధరమ్మలకి కాలు చేయీ ఆడ్డం లేదు.

ఆ సంఘటనకి ఆ రాత్రి వసుంధరమ్మకి ఒళ్ళు తెలీని జ్వరం.

దాంతో మరీ డీలా పడిపోయాడు రమేష్, గబగబా డాక్టరు దగ్గరికి పరుగెత్తాడు. ఆ జ్వరం ఉన్న వారం రోజులు వసుంధరమ్మని కంటికి రెప్పలా చూసుకున్నాడు.

## పదిలం

మతం మంటతో  
కావేషాల పాలమ మరిగించకు  
మరిగే పాలు పొంగి  
పొరలి పొయ్యనార్పితే  
అవ్వుడింక  
పాలేం బాముకు వేమ  
పొయ్యేం బాముకు వేమ ?

—ఎస్. కె. సత్యవతి

ఆ మర్నాడు వసుంధరమ్మకి జ్వరం తగ్గింది పత్యం పెట్టారు.

ఆ రోజు తల్లికి. తన పరిస్థితిని మళ్ళీ విన్నవించు కున్నాడు రమేష్.

"నేను మాత్రం ఏం చేయగలను రమేష్. నేను అసమర్దురాలిని.'' అంది నీరసంగా.

"అమ్మా నీవేం అనుకోకపోతే ఒకమాట. నీ గొలుసు ఇవ్వమ్మా. తాకట్టుపెట్టి ఆ డబ్బు కడతాను. మళ్ళీ తాకట్టు విడిపించి నీ గొలుసు నీకిచ్చే బాధ్యత నాది'' అంటూ వసుంధరమ్మవైపు చూసాడు.

"బాబూ రమేష్! ఈ గొలుసు నీకష్టాన్ని గట్టెక్కించలేదు. ఇది విలువలేని గొలుసు బాబూ. నీ ఆపద ఈ గొలుసుతో తీరేదికాదు. అంతకన్న నువ్వు కొన్న వస్తువులు అమ్మడం మేలు'' అంది వసుంధరమ్మ. ఆకంఠంలో 'నిన్ను నేను ఏ విధంగా ఆదుకోలేను బాబు,' అన్న బాధవ్యక్తం అయింది.

సంగతి అర్ధం చేసుకున్న రమేష్ మరలా ఆ ప్రసక్తి తీసుకురాలేదు. సరోజ సూటి పోటి మాటలు ఎక్కువయ్యాయి. 'ఈవిడకి పెట్టేఖర్చుతో మన సమస్య గట్టెక్కుతుంది' అన్నదొక రోజు. ఆ గొంతులో ఈసడింపు ధ్వనించింది. వసుం ధరమ్మకి రోజులు యాంత్రికంగా నడుస్తున్నాయి. కొడుకు, కోడలి సాధింపు, సూటిపోటి మాటలతో వసుంధరమ్మ మనసు గాయపడ్డది. ఇదివరకున్న ఆప్యాయత, అనురాగం ఇప్పుడు వాళ్ళలో లేవు. వసుంధరమ్మ ఉనికిని ఎవరూ పట్టించుకోవట్లేదు. మళ్ళీ మొదటి కొచ్చింది వైఖరి. ఈ గొలుసు విలువలేదనేగా నన్ను వీళ్ళు పురుగుకంటె హీనంగా చూస్తున్నారు! ఈ గొలుసుకి ఏమీ విలువలేదన గానే వాళ్ళలో ఎంత మార్పు. పట్టిడబ్బు మనుషులు. వాళ్ళకు డబ్బే లోకం. ఆప్యాయతా, అనురాగాల్ని డబ్బుతో కొనాలని చూసే మనుషులు వీళ్ళు. అని ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చింది వసుంధరమ్మ. గబగబా తన సామాను సర్దుకుంది. ఈ డబ్బు మనుషుల మధ్య బ్రతకటంకన్నా ఏ ఆశ్రమంలోనో తలదాచుకోవటం మంచిది అనుకుని.

"బాబూ రమేష్ నేను ఎలాగూ నీ కష్టం గట్టెక్కించలేను. నేను వెళ్ళిపోతే నీకో భారాన్ని తగ్గించిన దాన్నవుతాను. వెళ్తాను సరోజా, బాబూ వెళ్తాను అంది.'' ఇద్దరూ ముభావంగా తలలూపారు.

పరుగెడుతున్న రైల్లో కూర్చున్న వసుంధరమ్మ తన మెడలో ఉన్న గొలుసువైపు చూసుకుంది. డబ్బులేని తల్లుల్ని కొడుకులు ఎంత నీచంగా చూస్తారో ఎంతబాగా చూపించిందీ గొలుసు. ఈ బంగారపు గొలుసుని నిజంగా వాడి చేతిలో పెడితే ఎట్లా ఉండేదో!'

వసుంధరమ్మ మెళ్ళో ఉన్న గొలుసుకోసం, ఆఫీసుకి సెలవుపెట్టి రమేష్ అంతటి నాటకం ఆడాడని, వాళ్ళు ఆదే చదరంగంలో తననొక పావుగా ఉపయోగించుకో చూసారనీ'' ఆ తల్లి గ్రహించిన విషయం వారికి తెలియదు పాపం! □